క్లుప్తంగా

విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట



రామభద్రపురం జెడ్పీ ఉన్నత పాఠశాల సందర్శనలో కలెక్టర్ సూర్యకుమారి

రామభద్రపురం: విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తోందని కలెక్టర్ సూర్యకుమారి అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించిన ఆమె ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల చదువుపై ఆరా తీశారు. విద్యార్థుల విద్యాప్రగతికి సిబ్బంది కృషి చేయాలని, వారికి అర్థమయ్యేలా బోధన చేయాలన్నారు. బాగా చదువు కోవడం ద్వారా ఉన్నత స్థాయికి చేరుకుని, పేరు ప్రఖ్యాతలు సంపాదించవచ్చన్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో విద్యార్థులపై ఒత్తిడి లేకుండా వారిని స్వేచ్ఛగా చదువుకోనివ్వాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ లింగేశ్వరరెడ్డి, డిప్యూటీ డీఈఓ తిరుపతినాయుడు పాల్గొన్నారు.

భూ గర్భజలాలను సంరక్షించాలి

తెర్లాం: మార్చి 22న ప్రపంచ నీటి దినోత్సవం పురస్కరించుకుని, మండల కేంద్రంలో నీటి పొదుపుపై అవగాహన కల్పిస్తూ మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ ఎగ్జిక్యూటివ్ అధికారి సూరిబాబు ప్రతిఒక్కరూ భూ గర్భజలాల సంరక్షణకు తోడ్పడాలన్నారు. వర్షపు నీరు బయటకుపోకుండా ఇంకుడు గుంతలు తవ్వి, నీరు భూమిలో ఇంకేలా చేయాలన్నారు.

ఉగాది పంచాంగ శ్రవణం



తెర్లాం: ఎన్.బూర్జవలస గ్రామంలో పంచాంగ శ్రవణం కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

తెర్లాం: ఉగాది పండగ పురస్కరించుకుని, మండలంలోని పలు గ్రామాల్లో పంచాంగ శ్రవణం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ ఏడాది ఎవరి పేరు, బలాలు ఎలా ఉన్నాయి, ఆదాయ, వ్యయాలు ఎంతెంత ఉంటాయి, పంటలు బాగా పండుతాయా లేదా అనే విషయాలపై వేదపండితులు పంచాంగం చెప్పారు.
బొబ్బిలి రూరల్: మండలంలోని పెంట గ్రామంలో ఉన్న నగిరేశ్వరాలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. శోభకృత్ నామ సంవత్సరంలో ఏయే రాశుల వారికి జాతకం ఎలా ఉందో, వర్షాలు, పంటలు పండడంపై అర్చకులు పంచాంగం చదివి వినిపించారు.
రేగిడి: మండలంలోని సంకిలి గ్రామంలో నిర్వహించిన పంచాంగ శ్రవణం కార్యక్రమంలో ఈ ఏడాది పంటలు ఎలా పండుతాయి, వర్షాలు ఎలా కురుస్తాయన్న విషయాలను అర్చకులు గ్రామస్తులకు తెలియజేశారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

రాజాం సిటీ: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ప్రధానోపాధ్యాయుడు వి.వి.వసంతకుమార్ అన్నారు. మండల పరిధిలోని డోలపేట పాఠశాలలో ప్రపంచ అటవీ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కల పెంపకాన్ని బాధ్యతగా తీసుకోవాలని, ఖాళీ ప్రదేశాలు, ఇంటి ఆవరణలో మొక్కలు పెంచాలని కోరారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.
రేగిడి: ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా మండలంలోని అప్పాపురం, మజ్జిరాముడుపేట, దేవుదళ గ్రామాల్లో రైతులకు అందజేసిన మొక్కలను ఏపీఓ ఎస్.హరనాథరావు పరిశీలించారు. అనంతరం మొక్కల సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని వేతనదారులకు సూచించారు.

ఘనంగా ఫేర్‌వెల్ డే



బొబ్బిలి: ఆకట్టుకున్న విద్యార్థినుల డ్యాన్స్

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగి గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఫేర్‌వెల్ డే కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది, విద్యార్థులంతా పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు పలికి, రానున్న పబ్లిక్ పరీక్షలు బాగా రాయాలని ఆకాంక్షించారు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు.
రేగిడి: మండలంలోని దేవుదళ గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాల వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, ఉన్నత చదువులు చదవాలని కోరారు.
బొబ్బిలి: స్థానిక గొల్లపల్లి వేణుగోపాల మున్సిపల్ హైస్కూల్‌లో జరిగిన ఫేర్‌వెల్ డేలో భాగంగా విద్యార్థులు చేపట్టిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

చెరకు పంట దగ్ధం

బాడంగి: మండలంలోని ముగడ గ్రామ ఎర్రమ్మ పేరంటాలు పొలంలో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో 60 సెంట్ల విస్తీర్ణంలోని చెరకు పంట పూర్తిగా దగ్ధమైంది. దాదాపు రూ.35 వేల వరకు నష్టం సంభవించినట్లు బాధిత రైతులు రాంబాబు, రామారావు, సింహాచలం తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

● ఆరోగ్యమస్తు!



బొబ్బిలి రూరల్: పక్కి గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తున్న ఎంపీపీ లక్ష్మి, జెడ్పీటీసీ శాంతకుమారి



రామభద్రపురం: రాగిజావ తాగుతున్న విద్యార్థులు



రామభద్రపురం: విద్యార్థులకు రాగిజావ అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి



తెర్లాం: రాగిజావ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ ఉమాలక్ష్మి



బాడంగి: రాగిజావ పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ రామారావు



రాజాం: పెనుబాకలో విద్యార్థులతో కలిసి రాగిజావ తాగుతున్న జెడ్పీటీసీ నర్సింహులు

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకంలోకి మరో పౌష్టికాహారం వచ్చి చేరింది. విద్యార్థుల ఆరోగ్యమే ప్రధాన లక్ష్యంగా రోజుకో మెనూతో మధ్యాహ్న భోజనం అందిస్తున్న జగన్ సర్కార్ మరో అడుగు ముందుకు వేసి, రాగిజావ పంపిణీకి మంగళవారం శ్రీకారం చుట్టింది. ఐరన్, కాల్షియం వంటి పోషకాలు అందించి, విద్యార్థుల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపం నివారణకు ప్రతీ మంగళ, గురు, శనివారాల్లో ఉదయం పూట బెల్లంతో కూడిన రాగిమాల్ట్(అంబలి) అందిస్తుండడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. – సాక్షి నెట్‌వర్క్



రాజాం సిటీ: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రాగిజావ పంపిణీ



సంతకవిటి: మందాకురిటిలో రాగిజావ అందజేత



బొబ్బిలి: గొల్లపల్లి మున్సిపల్ హైస్కూల్‌లో రాగిజావ పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు



రేగిడి: బూరాడలో రాగిజావ పంపిణీలో ప్రజాప్రతినిధులు, సిబ్బంది



వంగర: హైస్కూల్‌లో రాగిజావ పంపిణీ చేస్తున్న ఎంఈఓ దుర్గారావు, ఎంఈఓ రమణమ్మ



మెంటాడ: రాగిజావ తాగుతున్న విద్యార్థులతో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు తదితరులు

చంద్రబాబు డైరెక్షన్‌లోనే టీడీపీ ఎమ్మెల్యేల రచ్చ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

● ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

రామభద్రపురం: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు డైరెక్షన్‌లోనే ఆ పార్టీ ఎమ్మెల్యేలు శాసన సభ సమావేశాల్లో రచ్చ చేస్తున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు మండిపడ్డారు. ఇదే విషయమై స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన అసెంబ్లీ(శాసనసభ)లో టీడీపీ ఎమ్మెల్యేల ప్రవర్తిస్తున్న తీరు, వారి వికృత చేష్టలు చూసి ప్రజలు ఛీదరించుకుంటున్నారన్నారు. ప్రతిపక్షం అంటే అవకాశం దొరికినప్పుడు అధికార పక్షంలోని లోపాలు ఎత్తిచూపడమో లేకపోతే మంచి చేయమని సలహాలు ఇవ్వడమో చేయాలే తప్ప ఎంతసేపు అనవసరమైన గొడవలకు దిగి, సభ విలువైన సమయాన్ని వృథా చేయడం కాదన్నారు. స్పీకర్ పోడియం ముట్టడించి, స్పీకర్‌పై చించిన కాగితాలు విసరడం ఆయనపై దాడికి ఎగబడడమేనన్నారు. అంతేకాకుండా దీనిని వారించేందుకు అడ్డం వచ్చిన అధికార పార్టీ ఎమ్మెల్యేను సైతం దుర్భాషలాడడం, నెట్టివేయడం హేయమైన చర్యలన్నారు. ఈ రాద్ధాంతానికి కర్త, కర్మ, క్రియ చంద్రబాబేనన్నారు. అసెంబ్లీ సమావేశాలు సజావుగా జరగకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా ఆయన చాలా దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ఆయన డైరెక్షన్ తర్వాతనే ఆ పార్టీ ఎమ్మెల్యే సభలో ఇలా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇలాంటి పనికిమాలిన పనులు చేసి, అధికారంలోకి వస్తామనుకోవడం టీడీపీ నాయకుల భ్రమ అన్నారు. ఎమ్మెల్యే అంటే ఇలా ఉండాలి అనిపించుకోవాలే తప్ప, ప్రజలు అసహించుకునేలా ఉండకూడదని హితవుపలికారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోని 175కు 175 ఎమ్మెల్యే స్థానాలను వైఎస్సార్ సీపీ గెలుచుకోవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, పార్టీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ డబ్ల్యూఎస్ రాయులు, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత
బొబ్బిలి: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, వైఎస్సార్ సీపీ కార్యాలయాల్లో బొబ్బిలి, బాడంగి, రామభద్రపురం మండలాలకు చెందిన ముగ్గురు వ్యక్తులకు రూ.90 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు మంగళవారం అందజేశారు. నిరుపేద, మధ్యతరగతి కుటుంబీకులకు సీఎంఆర్ఎఫ్ ఓ గొప్ప వరమని ఎమ్మెల్యే అన్నారు. ప్రస్తుతం మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు పాల్గొన్నారు.

వరల్డ్ డౌన్‌సిండ్రోమ్ డే
బాడంగి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో వరల్డ్ డౌన్‌సిండ్రోమ్ డే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. దివ్యాంగులైన చిన్నారులను తక్కువగా చూడకూడదని, వారిని అందరితో సమానంగా చూడాలని ప్రధానోపాధ్యాయుడు ఎస్.త్రినాధరావు కోరారు. దివ్యాంగులు కూడా ఆత్మన్యూనతాభావానికి గురికావద్దని, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

ఎంపీడీఓ పరిశీలన
బొబ్బిలి రూరల్: మండలంలోని శివడవలస, కమ్మవలస గ్రామ సచివాలయాలతో పాటు అక్కడి ఎంపీపీ పాఠశాలలను ఎంపీడీఓ అల్లు భాస్కరరావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేసి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.

విద్యార్థులకు రక్తపరీక్షలు
తెర్లాం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం రక్తపరీక్షలు నిర్వహించారు. ప్రతీ విద్యార్థి తనకు ఎంత శాతం రక్తం ఉందో తెలుసుకునేందుకు రక్త పరీక్షలు చేయించుకోవాలని పీహెచ్‌సీ సీహెచ్‌ఓ భాస్కరరావు తెలిపారు. మెరుగైన ఆరోగ్యానికి ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు.

చిరుధాన్యాల పంపిణీ
బొబ్బిలి రూరల్: మండలంలోని మెట్టవలస, జగన్నాథపురం, కోమటపల్లి, పిరిడి గ్రామ రైతు భరోసా కేంద్రాల్లో చిరుధాన్యాల పంపిణీ మంగళవారం చేపట్టారు. ఆరుతడి పంటలు ప్రోత్సహించేందుకు రైతులకు వీటిని అందజేశామని ఏడీఏ శ్యామ్‌సుందర్ తెలిపారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి
రేగిడి: గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాన్ని మంగళవారం పరిశీలించిన ఆయన ఆధార్ కార్డులో ఎటువంటి మార్పులు, చేర్పులు కావాలన్నా కేంద్రానికి రావాలని తెలిపారు.

దాడితల్లికి ప్రత్యేక పూజలు
బొబ్బిలి: మండలంలోని గొల్లపల్లిలో దాడితల్లి అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ఇష్టమైన వారం మంగళవారం ఘటాలను పూజించినట్లు భక్తులు తెలిపారు.

సేంద్రియ ఎరువులు తయారు చేయండి
రాజాం సిటీ: మండలంలోని పెనుబాకలో ఉన్న చెత్త సంపద తయారీ కేంద్రాన్ని ఈఓపీఆర్‌డీ వావిలపల్లి శ్రీనివాసరావు మంగళవారం పరిశీలించారు. గ్రామంలో ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను కేంద్రాలకు తరలించి, సేంద్రియ ఎరువులు తయారు చేయాలని క్లాప్‌మిత్రలకు ఆయన సూచించారు.

ఆర్‌డీఓకు వినతిపత్రం అందజేత
బొబ్బిలి: ఫీజుల కోసం ఒత్తిడి చేస్తున్న డిగ్రీ కాలేజీ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి డి.రాము కోరారు. ఇదే విషయమై ఆయన ఆర్‌డీఓ పి.శేషశైలజకు మంగళవారం వినతిపత్రం అందజేశారు.

నిరసన
బొబ్బిలి రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రెవెన్యూ ఉద్యోగులు మంగళవారం నిరసనకు దిగారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో డీఏ బకాయిలు చెల్లించాలని, ఒకటో తేదీకి జీతాలు చెల్లించాలని కోరారు.

మద్దువలస డ్యామ్‌లో చేపల వేట నిషేధం
వంగర: మండలంలోని మద్దువలస డ్యామ్(రిజర్వాయర్)లో అక్రమంగా చేపల వేట చేస్తే చర్యలు తీసుకుంటామని శ్రీసీతారామ ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షుడు గుడివాడ లక్ష్మీనారాయణదొర హెచ్చరించారు. మంగళవారం విలేకరులతో మాట్లాడిన ఆయన రెండు ఘనలీల సొమ్ము ప్రభుత్వానికి చెల్లించని కారణంగా చేపలవేట నిషేధిస్తూ మత్స్యశాఖ ఉత్తర్వులు జారీ చేసిందని, ఈ నేపథ్యంలో రిజర్వాయర్‌లో చేపలవేట చేయరాదన్నారు.

ఘనజీవామృతం తయారీపై అవగాహన
తెర్లాం: మండలంలోని పెదపాలవలస గ్రామంలో ఘనజీవామృతం టైప్-2 తయారీపై మంగళవారం అవగాహన కల్పించారు. ఘనజీవామృతంతో భూసారం మరింత పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం పూనువలస క్లస్టర్ మండల యాంకర్ ఆర్నిపల్లి సింహాద్రినాయుడు తెలిపారు.

























